9న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- పకడ్బందీ నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో 52 సెంటర్లు.. తొలిసారిగా బయోమెట్రిక్ విధానం
- అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డులు తేవాలి
- అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు

మామిళ్లగూడెం, మే 28 : జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు పరీక్షల నిర్వహణపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీఎస్‌పీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ చేపట్టాలన్నారు. తొలిసారిగా బయోమెట్రిక్ విధానం పాటిస్తున్నారని, జిల్లాలో మొత్తం 52 సెంటర్లు ఏర్పాటు చేయగా.. 18,403 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్షల ముందు రోజు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టికెట్లు సంబంధిత సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, ప్రతి కేంద్రంలో ఉదయం 10 గంటలకు గేట్లు మూసి వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి హాలులో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి వెంట తెచ్చుకోవాలని తెలిపారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించుకొని, సొంత డిక్లరేషన్ రాసి ఇవ్వాలని, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్వో రాజేశ్వరి, విజయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌బాబు, ఎస్బీఐటీ ప్రిన్సిపాల్ రాజకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం ఆసుపత్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నామా

వేల కుటుంబాల్లో 'ఎన్టీఆర్' వెలుగులు: నామా

ఖమ్మం, మే 28: టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హాస్పిటల్ ట్రస్ట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణతో కలిసి ట్రస్ట్ సభ్యుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిరుపేదల కుటుంబాలకు అండగా ఉండేందుకు బసవతారకం ఆస్పత్రి స్థాపించిన ఎన్టీఆర్.. వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు.

పినపాక వంతెనపై గుంతలు

వైరా నుంచి తల్లాడ వెళ్లే దారిలో ప్రయాణం చేయాలంటేనే ప్రయాణికులు వణికి పోతున్నారు. స్టేజీ పినపాక వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా ఉంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ఈ గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈ వంతెనపై ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలు అనేకం.
-వైరా రూరల్, మే 28

నవ వధువు ఆత్మహత్య

వర్షిత (ఫైల్)

వైరా రూరల్, మే 28: కడుపునొప్పి తాళలేక నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నారపనేనిపల్లి గ్రామానికి చెందిన దావులూరి కిరణ్‌కుమార్ - ప్రసన్న దంపతుల పెద్ద కుమార్తె వర్షిత (25)కు ఏపీ ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు మండలం ఎరుకోపాడు గ్రామానికి చెందిన బండి గోపీతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వివాహమైన వారం రోజులకే గోపీ అమెరికా వెళ్లాడు. వర్షిత హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. వర్షిత కొద్ది రోజులుగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్నది. తల్లిదండ్రులకు ఈ విషయాన్ని చెప్పగా వారు ఆమెను హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున వర్షిత కనిపించకపోవడంతో కుటుంబీకులు ఇంటి పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఇంటి ముందు ఉన్న బావిలో వర్షిత మృతదేహం తేలియాడడం చూసి బోరున విలపించారు. తండ్రి ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర క్యాంపు కార్యాలయంలో..

సత్తుపల్లిలో నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

తిరుమలాయపాలెంలో..

హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న సండ్ర

మహోన్నత వ్యక్తి.. ఎన్‌టీఆర్

ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తారక రామారావు జయంతి వేడుకల్లో వక్తలు

నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) మహోన్నత వ్యక్తి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సినీ, రాజకీయ రంగల్లో ఆయన పెనుమార్పులు తీసుకొచ్చారని గుర్తుచేశారు. పాలనలో ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు నేడు దేశ వ్యాప్తంగా అమలవుతున్నాయని వివరించారు. ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు మంగళవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల అన్నదానాలు, రక్తదానాలు, కేక్ కటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆయా రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తుచేశారు. అవి ఎంతో శ్లాఘనీయమైనవని కొనియాడారు. **-నమస్తే నెట్‌వర్క్**

సొసైటీల్లో పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

వైరాలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

ఎర్రుపాలెం/ కొణిజర్ల/ వైరా టౌన్, మే 28: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 60 శాతం సబ్సిడీపై 80 టన్నుల జీలుగు విత్తనాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు ఎర్రుపాలెం ఏవో కే.విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎర్రుపాలెం మండలంలోని రాజుపాలెం, పెద్దగోపవరం, అయ్యవారిగూడెం, తక్కెళ్లపాడు, మొలుగుమాడు సొసైటీల్లో పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 30 కేజీల జీలుగు విత్తనాల బ్యాగు రూ.1,116కు అందించనున్నట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో టోకెన్ తీసుకొచ్చి సొసైటీల్లో విత్తనాలు పొందాలని సూచించారు.

కొణిజర్లలో..

కొణిజర్ల గోపవరం పీఏసీఎస్‌లో రాయితీ పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఏవో బాలాజీ తెలిపారు. 40 కేజీల జనుములు బస్తాను సబ్సిడీపై రూ.1,448కు అందించనున్నట్లు చెప్పారు.

వైరాలో..

వైరా మండలంలోనూ బుధవారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైరా ఏవో పవన్‌కుమార్ సూచించారు. కాగా, వైరా సొసైటీలో జీలుగుల పంపిణీని ఏడీఏ కరుణశ్రీ మంగళవారం ప్రారంభించారు. సీఈవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన బోరును పునరుద్ధరించాలి

ప్రధాన రహదారిపై గ్రామస్తుల నిరసన

రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ఖమ్మం రూరల్, మే 28: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరుబావిని తిరిగి తెరిపించాలని కోరుతూ ప్రధాన రహదారిపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేసిన ఘటన ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, అధికారుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లగూడెంలో గతంలో 6 బోర్లు ఉండగా 5 బోర్లను అధికారులు పునరుద్ధరణ చేసి వాడుకలోకి తీసుకువచ్చారు. అయితే బొడ్రాయి సెంటర్‌లోని మాదాల తిరుపతయ్య తన ఇంటి ఎదుట ఉన్న బోరును ఇంటికి అడ్డుగా వస్తుందని పూడ్చివేశాడు. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు పూడ్చిన బోరును తిరిగి తెరిపించాలని కోరుతూ ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై కొద్దిసేపు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కుమార్ హుటాహుటిన గ్రామానికి వెళ్లి విషయం అడిగి తెలుసుకున్నారు. పూడ్చిన బోరుబావిని తిరిగి తెలిపిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

కిష్టారం ఓసీని సందర్శించిన..

కేంద్ర పర్యావరణ అధికారి

మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కేంద్ర పర్యావరణ శాఖ అధికారి

సత్తుపల్లి, మే 28: మండలంలోని కిష్టారం ఓసీని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ తరుణ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ కండీషన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్విరాన్‌మెంట్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఓసీలో ఎన్విరాన్‌మెంట్‌లో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. సింగరేణి, ఎన్విరాన్‌మెంట్ అధికారులు షాలెం రాజు, జేవీఎల్ గణపతి, నర్సింహారావు, సత్యనారాయణ, రవికిరణ్, సీహెచ్ శ్రీనివాస్, బీ.రామకృష్ణ, రమణారావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల కోసం పడరానిపాట్లు

కాంగ్రెస్ పాలనలో మరోసారి బోనకల్లులో బారులు

బోనకల్లు, మే 28: అడపా దడపా కురుస్తున్న వర్షాలతో భూమి తడవడంతో పాటు దుక్కులు దున్నేందుకు అనుకూలంగా మారింది. దీంతో రైతులు వానకాలం సాగు కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందస్తుగా విత్తనాలు కొనుగోలు చేసుకునే పనిలో పడ్డారు. మండలంలో గత ఏడాది పత్తి సాగుపై చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించారు. దీంతో ఎక్కువ దిగుబడి ఇచ్చిన హైబ్రిడ్ విత్తనాల కోసం డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే బోనకల్లులోని ఓ డీలర్ షాపు వద్ద రైతులు హైబ్రిడ్ పత్తి విత్తనాల కోసం బారులు తీరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటితోపాటు ఎరువులు, విత్తనాల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు పుష్కలంగా పంటలు పండించుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. యాసంగి పంటలకు పూర్తిస్థాయిలో నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం వానకాలం సీజన్‌లో సాగుకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాల్సి ఉండగా.. రైతులు ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా తమకు అవసరమయ్యే విత్తనాలను ప్రభుత్వం డీలర్లకు సరఫరా చేయించి అమ్మే విధంగా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పత్తి విత్తనాల కోసం బోనకల్లులో బారులు తీరిన రైతులు

కోణార్క్ రైలులో 11 కేజీల గంజాయి స్వాధీనం

గంజాయిని చూపిస్తున్న అధికారులు

మామిళ్లగూడెం, మే 28: భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-2 సీఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఖమ్మం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం-2లో రైలు బోగీలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగ్‌లను సోదా చేసినట్లు తెలిపారు. అందులో 11 కేజీల ఎండు గంజాయి లభించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉత్తర్వులు రద్దు చేయాలంటూ డీఈవోకు వినతి

డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న సంఘం నేతలు

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 28: 6, 7 తరగతుల గణిత సబ్జెక్టును భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బోధించాలని ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో సోమశేఖరశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిజికల్ సైన్స్ నియామకానికి కావాల్సిన అర్హతల్లో ఎక్కడ కూడా గణితం చదవాలనే నిబంధన లేదని అన్నారు. సంఘం బాధ్యులు జగదీశ్వర్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: సీఐ

నిల్వలను పరిశీలిస్తున్న సీఐ, ఏవో

రఘునాథపాలెం, మే 28: నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువులు, విత్తనాల విక్రయ డీలర్లకు రఘునాథపాలెం సీఐ శ్రీహరి స్పష్టం చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఇంటూరి భాస్కర్‌రావుతో కలిసి మండలంలోని ఫెస్టిసైడ్స్ షాపులు, విత్తనాల గోదాములను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలని సూచించారు.

విత్తన దుకాణాల్లో వ్యవసాయాధికారుల తనిఖీ

బోనకల్లు, మే 28: మండలంలోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రైతులు పంటల సాగు కోసం డీలర్లకు సరఫరా అయిన విత్తన ప్యాకెట్లను, స్టాక్ రికార్డులను ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 17,718 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయనున్నట్లు అంచనా వేశామన్నారు. అందుకు తగినట్లుగా విత్తన దుకాణాల్లో 8,160 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి దుకాణంలోనూ 15 - 20 కంపెనీల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకే రకం విత్తనాల విక్రయిస్తూ కొరతను సృష్టించవద్దని సూచించారు.

'పాలేరు'లో 68.89 శాతం 'ఎమ్మెల్సీ' పోలింగ్

కూసుమంచి, మే 28: పాలేరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్‌లో 68.89 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 15,725 మంది ఓటర్లకు గాను 10,833 మంది పట్టభద్రులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కూసుమంచిలో 3,036 మంది ఓటర్లకుగాను 2,141 మంది ఓటు వేశారు. 70.52 శాతం పోలింగ్ నమోదైంది. ఖమ్మం రూరల్‌లో 7,177 మందికి గాను 4,948 మంది ఓటు వేశారు. 70.26 శాతం పోలింగ్ నమోదైంది. నేలకొండపల్లిలో 3,074 మంది ఓటర్లకుగాను 2,160 మంది ఓటు వేశారు.70.26 శాతం పోలింగ్ నమోదైంది. తిరుమలాయపాలెంలో 2,438 మంది ఓటర్లకు గాను 1,584 మంది ఓటు వేశారు. 64.22 శాతం పోలింగ్ నమోదైంది.

నకలీ విత్తనాలు అరికట్టేందుకు చర్యలు: ఏడీఏ

కూసుమంచి, మే 28: వానకాలంలో వరి వేసే విస్తీర్ణం నమోదు, మార్కెటింగ్ అంశాలతోపాటు నకిలీ విత్తనాలు అరికట్టే విధంగా కూడా తగిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. రైతులందరూ విత్తనాలు కొనుగోళ్లు చేసిన సమయంలో రసీదులు తీసుకోవాలని సూచించారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా పంటలు నమోదు చేసుకోవాలని సూచించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

మధిర, మే 28: మండలంలోని మాటూరుపేట గ్రామానికి చెందిన ముదిగొండ మల్లేశ్వరరావు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేరు. దీంతో పెద్ద కుమార్తె సాగి పుల్లమ్మ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించి తలకొరివి పెట్టింది.

అనారోగ్యంతో ఐకేపీ వీవోఏ మృతి

తిరుమలాయపాలెం, మే 28 : మండలంలోని ఏలువారిగూడెంలో ఐకేపీ వీవోఏ కంచర్ల పద్మ(50) మంగళవారం మృతిచెందింది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె మరణవార్త గురించి తెలుసుకున్న మండల మహిళా సమాఖ్య సభ్యులు, వీవోఏల సంఘం నాయకులు, ఐకేపీ సిబ్బంది ఏలువారిగూడెం వెళ్లి పద్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

తెలంగాణ సాంఘిక చైతన్యానికి దిక్సూచి.. 'సురవరం'

ఖమ్మం, మే 28: తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, ప్రముఖ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు నివాళులర్పించారు. ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం వారు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యానికి సురవరం దిక్సూచి అని కొనియాడారు. ఉద్యమకారులు ములక సురేశ్, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, సతీశ్, దశరథ, సత్యనారాయణ, భాస్కర్, శోభనాద్రి, ఆసిఫ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1).TS28TA5867 - TATA ACE GOLD DIESEL BS6 - 2021.
2).TS28TA9740- MAHINDRA JEETO PLUS BS6 - 2022.
3).TS28TA9233 - BAJAJ RE DIESEL BS 6- 2022
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

PASSPORT LOST
I, Mandapati Sita Maha Lakshmi, W/o.Mandapati Venkata Reddy, R/o. H.No. 2-185/2, Marlapadu Village Vemsoor Mandal, Khammam Dist, that while I went to Marlapadu to Sathupally for Passport Renewal purpose by bike along with lost my passport (No: K3141436) Those who found it please inform to below Number.
Cell:9949285896

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616